

మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వకుండా..

ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడి మృతదేహాన్ని అన్న ఇంట్లోకి రానివ్వలేదు. - 8లో..



దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

మార్కాపురంలో జరిగిన భారీ చోరీని ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 32 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డయల్ యువర్ కలెక్టర్ నిర్వహించిన డీఆర్వో



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో

ఒంగోలు అర్బన్: ప్రకాశం భవనంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి ఫోన్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్దిష్ట గడువులో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. దీనిలో స్పందన సూపరింటెండెంట్ నాగజ్యోతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

- కొరిశపాడు గ్రామానికి చెందిన ఏడుకొండలు డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి గుండ్లకమ్మ భూ సేకరణ కోసం 57 ఎకరాల భూమిని 33 మంది రైతుల నుంచి సేకరించారన్నారు. అయితే ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదని పరిశీలించి త్వరగా నష్ట పరిహారం అందజేయాలని కోరారు.
- పుల్లలచెరువుకు చెందిన ఆదెమ్మ ఫోన్ చేసి తన భూమిని మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేశారని, ఎన్నిసార్లు సరిచేసి తన పేరుపై ఆన్‌లైన్ చేయాలని కోరినా అధికారులు స్పందించడం లేదని తెలిపారు. దీనిపై పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరింది.

వృత్తి నైపుణ్యంతో ఉపాధి పొందవచ్చు

- కలెక్టర్ దినేష్‌కుమార్



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన యువత తప్పనిసరిగా ఉపాధి పొందవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్‌ల ద్వారా నైపుణ్య శిక్షణ పొందిన యువతకు కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్లతో పాటు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలురు, బాలికల ఐటీఐ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ల్లో శిక్షణ పొందిన అభ్యర్థుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యువత సొంత కాళ్లపై నిలవాలని సూచించారు. అనంతరం స్పందన భవనంలో కార్యక్రమం నిర్వహించారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ నాగేశ్వర రావు, ఇతర అధికారులు మధుసూదన్ రెడ్డి, జాలిరెడ్డి, రవికుమార్, రాజారావు, కృష్ణమూర్తి, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రాక్టికల్ పరీక్షలు

ఒంగోలు టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండో రోజు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఐఓ సైమన్ విక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. 101 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని, ఉదయం సెషన్‌లో 5930 మందికి గాను 5534 మంది పరీక్షలకు హాజరయ్యారని, 396 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు. మధ్యాహ్నం సెషన్‌కు 4957 మందికి గాను 4711 మంది పరీక్షలకు హాజరయ్యారని, 246 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కందుకూరులోని పరీక్ష కేంద్రాలను ఆర్జేడీ వీవీ సుబ్బారావు, ఒంగోలు పరిసర ప్రాంతాల పరీక్ష కేంద్రాలను ఆర్ఐఓ సైమన్ విక్టర్, మిగతా కేంద్రాలను డీఈసీ మెంబర్లు స్వరూపారాణి, రమణారెడ్డి, హెచ్‌పీసీ మెంబరు నాగేశ్వరరావులతో పాటుగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ముమ్మరంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ పరీక్ష కేంద్రాల్లో తగిన జాగ్రతలు తీసుకున్నామన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ఒంగోలు అర్బన్: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (రూడ్‌సెట్) ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భాగ్యనగర్‌లో ఉన్న శిక్షణ కేంద్రంలో మార్చి 6 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తి ఉచితంగా కల్పిస్తారన్నారు. జిల్లాకు చెందిన స్త్రీలు (19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన) వారు మాత్రమే అర్హులని తెలిపారు. వివరాలకు 95733 63141 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మా ఉప్పు.. ఎంతో గొప్పదండీ!

పిడికెడు ఉప్పు.. స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చింది. మహాత్ముని పిలుపుతో సత్యాగ్రహ ఆయుధమైంది. 'మా ఉప్పు.. మా సొంతం' అంటూ జనగళం ఉవ్వెత్తున ఎగసి దేవరంపాడు కేంద్రంగా పోరాటం ఊపందుకుంది. జిల్లాలో ఉప్పుసాగుకు ఇంతటి ఘన చరిత్ర ఉంది. ఉప్పు సత్యాగ్రహ దీక్షకు మార్చి 1వ తేదీకి 93 ఏళ్లు నిండుతాయి. ప్రస్తుతం 4 వేల ఎకరాలకు పైగా జిల్లాలో ఉప్పు సాగవుతోంది. వేలాది మందికి ఉపాధినిస్తోంది. జిల్లాలో ఉప్పు సాగు విశిష్టతపై సమగ్ర కథనం..

- దండి సత్యాగ్రహంతో ఊపిరి పోసుకున్న ఉప్పు సత్యాగ్రహం
- ఒంగోలు మండలం దేవరంపాడు కేంద్రంగా ముమ్మరంగా ఉప్పు సత్యాగ్రహం
- బకింగ్‌హాం కెనాల్ ద్వారా ఉప్పును దోచుకుపోయిన బ్రిటీష్ పాలకులు
- గాంధీజీ పిలుపుతో సముద్ర తీర ప్రాంతాల్లో ముమ్మరంగా సత్యాగ్రహ దీక్ష
- ఉప్పు సత్యాగ్రహానికి మార్చి 1వ తేదీకి 93 ఏళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: బ్రిటీష్ పాలకులు దేశాన్ని పాలిస్తున్న రోజులవి. దేశానికి మూడు వైపులా సముద్రాలున్నాయి. దీంతో ఉప్పు పర్రలు, ఉప్పు చెలికలు సహజ సిద్ధంగా ఏర్పడేవి. దాంతోపాటు రైతులు ఉప్పు కొఠారులను కూడా ఏర్పాటు చేసుకొని ఉప్పును పండించేవారు. నాణ్యమైన ఈ ఉప్పును బ్రిటీషర్లు దోచుకుపోయేవారు. ఇతర దేశాలకు లక్షల టన్నుల కొద్దీ ఎగుమతులు చేపట్టేవారు. దానికితోడు రైతులు పండించిన ఉప్పు పంటపై శిస్తు, ఉప్పు సాగుపై ఆంక్షలు విధించింది బ్రిటీష్ ప్రభుత్వం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వేలాది ఎకరాల్లో ఉప్పు పండించేవారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఉప్పును బకింగ్ హాం కెనాల్ ద్వారా పడవల్లో, షిప్పుల్లో చెన్నైకి తరలించి అక్కడ నుంచి ఇతర దేశాలకు ఎగుమతులు చేసుకునేవారు.

పౌరుషాల గడ్డ ప్రకాశంలో ఉప్పు సత్యాగ్రహం

బ్రిటీషర్లు ఉప్పుపై ఆంక్షలు విధించటంతో స్వాతంత్రోద్యమాన్ని నడుపుతున్న మహాత్మా గాంధీ గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతి వద్ద 1930 మార్చిలో దండి పాదయాత్రను ప్రారంభించారు. ఆ ప్రకటనతో ప్రకాశం జిల్లాలోని ప్రస్తుతం ఒంగోలు మండలం దేవరంపాడులో ఉప్పు సత్యాగ్రహ పోరాటం ఊపందుకుంది. గుండ్లకమ్మ నదికి ఉత్తరాన కనపర్తి గ్రామంలో ఉప్పు కొఠార్లు ఉండేవి. గుండ్లకమ్మకు దక్షిణాన దేవరంపాడు గ్రామంలో సహజసిద్ధంగా ఏర్పడిన ఉప్పు పర్రలు, చెలికలు ఉండేవి. దాంతో ఈ రెండు గ్రామాలను కేంద్రంగా చేసుకున్న అఖిల భారత కాంగ్రెస్ పార్టీ దేవరంపాడులో ఉప్పు సత్యాగ్రహ శిబిరం ఏర్పాటు చేసింది. అక్కడ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం ఉవ్వెత్తున ప్రారంభించారు. అప్పటి నుంచి ఉద్యమకారులను అరెస్టు చేసేది.

ఉప్పు కోసం బ్రిటీష్ ప్రభుత్వం జిల్లాలో రెండు కార్యాలయాలు

బ్రిటీష్ పాలనలో ఉప్పును దక్కించుకోవటానికి అప్పట్లో బ్రిటీష్ మిలిటరీ, పోలీసుల ఆధ్వర్యంలో రెండు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఒకటి కనపర్తిలో, రెండోది సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామంలో ఉన్నాయి. వీటి వద్ద విపరీతమైన పోలీస్ పహారా సాగేది. అనంతరం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆ రెండు చోట్ల కేంద్ర ప్రభుత్వం ఉప్పు నిర్వహణ కార్యాలయాలు ఏర్పాటు చేసింది. ఈ రెండు కార్యాలయాల పరిధిలో ఇప్పటికే రెండు వేల ఎకరాలకు పైగా ఉప్పు పండించే కేంద్ర ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయి. ఇప్పటికీ కౌలు రూపంలో కేంద్ర ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం కూడా సమకూరుతోంది. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది కూడా అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 4 వేల ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు.



ఉప్పుకొఠారు

బస్తా ఉప్పు ప్రస్తుతం రూ.360

గతంలో ఎన్నో ఆంక్షలు, శిస్తులు దాటుకొని ప్రస్తుతం ఉప్పు ధర అదరగొడుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా బస్తా ఉప్పు ధర రూ.360కి చేరింది. దీంతో ఉప్పు రైతుల్లో ఎనలేని ఆనందం నెలకొంది. గతంలో బ్రిటీష్ కాలంలో ఉప్పును ఇక్కడ నుంచి చెన్నైకి పడవల్లో తరలించేవారు. ప్రస్తుతం ఇక్కడ నుంచి దేశంలోని అనేక రాష్ట్రాలకు ఉప్పు ఎగుమతి అవుతోంది. ఇంతటి ధర గతంలో ఎప్పుడూ రాలేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దేవరంపాడులోని ఉప్పు సత్యాగ్రహం విజయ స్థూపం

దేవరంపాడులో విజయ స్థూపం...

ఒంగోలు మండలం దేవరంపాడులో 1935లో అప్పటి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ విజయ స్థూపాన్ని ప్రారంభించారు. ఉప్పు సత్యాగ్రహ పోరాటంతో బ్రిటీష్ ప్రభుత్వం యిర్విన్ ఒడంబడిక ద్వారా శిస్తుతో పాటు ఉప్పుపై విధించిన ఆంక్షలను ఎత్తేసింది. దీంతో దేవరంపాడు ఉప్పు సత్యాగ్రహం చేసిన శిబిరం వద్ద విజయ స్థూపాన్ని 1935 నవంబర్ 21న ఏర్పాటు చేశారు. ఆ స్థూపంపై మహాత్మా గాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు.



ఉప్పు కుప్పగా పోస్తున్న మహిళా కూలీ

చిన్నప్పుడు ఈ ప్రాంతం కోలాహలంగా ఉండేది



మా చిన్నతనంలో దేవరంపాడు ప్రాంతం కోలాహలంగా ఉండేది. ఉప్పు సత్యాగ్రహ శిబిరం, విజయ స్థూపం వద్దకు ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు వచ్చేవారు. మా చిన్నప్పుడు ప్రకాశం పంతులు ఒడిలో ఆడుకున్నాం. దేవరంపాడు గ్రామంలో కొంతకాలం ప్రకాశం పంతులు నివాసం కూడా ఉన్నారు.

– పెనుమత్స కృష్ణంరాజు, దేవరంపాడు

సత్యాగ్రహ శిబిరం ప్రకాశం పంతులు కుటీరమే



ఉప్పు సత్యాగ్రహానికి ఇచ్చిన శిబిరానికి సంబంధించింది ప్రకాశం పంతులు విడిది కోసం వచ్చినప్పుడు వాడుకునే కుటీరమే. ఆయన బారిస్టర్‌గా బాగా సంపాదించే రోజుల్లో వేసవిలో వచ్చి సేద తీరేందుకు అక్కడ స్వంతంగా కుటీరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఉప్పు సత్యాగ్రహం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో దేవరంపాడులోని ఆయన కుటీరాన్ని ఆందోళనల కోసం ఇచ్చేశారు. ఆయన కూడా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. మా నాన్న సాగి విజయరామరాజు. ఉప్పు సత్యాగ్రహం దేవరంపాడులో ఆయన సారథ్యంలోనే నిడిచింది. అందుకే గ్రామంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

– సాగి కృష్ణంరాజు, దేవరంపాడు

మా తాత మనేదార్‌గా ఉండేవారు



దేవరంపాడును కేంద్రంగా చేసుకొని ఉప్పు సత్యాగ్రహం ఉవ్వెత్తున సాగింది. నేను 1930 సంవత్సరంలో పుట్టాను. మా తాత బ్రిటీష్ పాలనలో మనేదార్‌గా పనిచేశారు. అప్పట్లో ఉప్పుపై శిస్తు వసూలు చేసేవారు. మా తాతే పన్నులు వసూలు చేసేవారు. అప్పట్లో కరవది, కనపర్తి, దేవరంపాడు గ్రామాల్లో ఆందోళనలు జరిగేవి. నా చిన్నప్పుడు ఉప్పు బస్తా రూ.5 కూడా ఉండేది కాదు. అలాంటిది ఇప్పుడు రూ.350 నుంచి రూ.360 వరకు మంచి ధర పలుకుతోంది.

– చుంచు నరిశింహారావు, ఉలిచి

రానున్న ప్రతి ఎన్నికలో విజయం మనదే

- ప్రతి ఇంటికీ గృహ సారథులు వెళ్లాలి
- ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం గురించి ప్రజలకు వివరించాలి
- ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి
- జగనన్న సచివాలయ గృహ సారథులకు శిక్షణ



ఒంగోలు రూరల్ మండలం జగనన్న సచివాలయం గృహసారథుల శిక్షణకార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: రానున్న ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన ఒంగోలు మండల జగనన్న సచివాలయ గృహ సారథుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి గృహ సారథులు ఆయా వలంటీర్లను వెంటపెట్టుకొని ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరినీ పరిచయం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంట్లో వివరించాలని సూచించారు. అభివృద్ధే లక్ష్యంగా మన పాలన సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏ కార్యక్రమం చేపట్టినా అది ప్రజలందరికీ అనునిత్యం ఉపయోగపడేదేనని గుర్తు చేశారు. ప్రజల్లో కొనుగోలుశక్తి పెరిగితేనే పారిశ్రామిక రంగం అయినా అభివృద్ధి చెందుతుందని, ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాల వరద కొనసాగించారన్నారు. కరోనా సమయంలో ఆయన వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజానీకానికి ఎనలేని ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంలో భాగంగా పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడం ద్వారా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని పేర్కొరన్నారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని అందులో ఏమాత్రం వెనుకడుగు వేసేది లేదన్నారు. అందులో భాగమే కరోనా సమయంలో పేద ప్రజలకు అండగా నిలిచేందుకు తమ కుటుంబం ఎంతగా తపన పడింది ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు మొహం చాటేసి, ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ముందుకు రావడం తన విధానం కాదని స్పష్టం చేశారు.

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరి రావు మాట్లాడుతూ ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ కేటాయించిన పనులను జగనన్న గృహసారథులు కష్టపడి చేస్తే ప్రతి ఒక్కరూ మన పార్టీకి తప్పక ఓటు వేస్తారని చెప్పారు. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే పేద కుటుంబాలకు ఒక వైపు సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే మరో వైపు వారి బిడ్డలకు ఉన్నతమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు పౌష్టికాహారం, పాఠశాల స్థితిగతులు మార్చడం, సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగంతో కాలేజీ నుంచి బయటకు రావాలనే ఆలోచన ఇవన్నీ కూడా పేదల కుటుంబాలను దృష్టిలో చేస్తున్న పనులేనన్నారు. మరో వైపు మధ్య తరగతి వర్గాలకు సైతం అండగా ఉండేందుకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలకు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. గతంలో తోపుడు బండ్ల యజమానులను ప్రైవేటు వడ్డీ వ్యాపారులు ఎంతగానో పీడించేవారని, కానీ నేడు జగనన్న తోడు, దర్జీలు, నాయీబ్రాహ్మణులు, రజకులకు అండగా నిలిచేందుకు అందిస్తున్న ఆర్థిక సాయం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జగనన్న గృహ సారథులకు మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జున రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి అంకయ్య, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య చైర్మన్ వాకా బసివి రెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, చుండూరు రవి, కఠారి శంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రచారానికి ప్రణాళికలు

- జోరందుకున్న టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి
- తేలిన బరిలోని అభ్యర్థులు
- పోటీలోని అభ్యర్థులను ప్రకటించిన రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్
- టీచర్ ఎన్నికలకు: 8 మంది, పట్టభద్రుల ఎన్నికలకు: 22 మంది

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి జిల్లాలో మొదలైంది. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 27 న నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ముగిసింది. దీంతో టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బరిలో ఉండే అభ్యర్థులు తేలారు. పోటీలోని అభ్యర్థులు తేలడంతో ఎన్నికల సందడి మొదలైంది. జోరుగా ప్రచారం నిర్వహించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దూకుడుగా ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే వైఎస్ఆర్ సీపీ బలపరచిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇంటింటికీ తిరిగి ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు:

గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఎవ్వరూ చేయని విద్యాభివృద్ధిని సర్కారు చేసి చూపించింది. ప్రభుత్వం చేసిన అభివృద్ధి వైఎస్ఆర్ సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు అనుకూలంగా మారింది. ఇప్పటికే వైఎస్ఆర్ సీపీ అభ్యర్థులకు పలు సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. పీడీఎఫ్, బీజేపీ అభ్యర్థులు టీచర్ ఎన్నికల్లో బరిలో ఉన్నారు. అదే విధంగా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులతో పాటు, ఇండిపెండెంట్‌లు బరిలో నిలిచారు. గెలుపు కోసం వారు ఎన్ని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఎక్కువ మంది ఓటర్లు మద్దతు తెలుపుతున్నారు.

పోటీదారులు వీరే....

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు: వైఎస్ఆర్ సీపీ తరపున పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పీడీఎఫ్ తరపున పొక్కిరెడ్డి బాబురెడ్డి, బీజేపీ అనుబంధం ఆపస్ సంఘం తరపున కుట్టుబోయిన బ్రహ్మానందం, మాజీ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన శ్రీరామమూర్తి, వీరితో పాటు పర్వతరెడ్డి ప్రవీణ, ధనుంజయ శివయోగి, చిన్నరమణారెడ్డి లక్కు, అనసూయమ్మ లక్కు మొత్తం 8 మంది పోటీలో ఉన్నారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికలకు..

పట్టభద్రుల ఎన్నికలకు 23 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. అందులో సోమవారం పేర్నాటి హేమ సుష్మిత నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో 22 మంది బరిలో నిలిచారు. వారందరూ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు. వైఎస్ఆర్ సీపీ తరపున పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ తరపున కంచర్ల శ్రీకాంత్ చౌదరి, బీజేపీ తరుపున సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఇండిపెండెంట్‌లుగా బుస్సా రాజేంద్ర, కంచెర్ల సరిత, మట్టిగుంట కిరణ్ దాసరన్న, నీలం శామ్యూల్ మోజెస్, కామిశెట్టి భాస్కరరావు, బొట్టికాయల చంద్రశేఖర్, మాదాసి జలారావ్, పల్లిపట్టు అభినవ్‌విష్ణు, మీగడ వెంకటేశ్వరరెడ్డి, పతంగి పాలంకరెడ్డి, వీరభద్రాచారి, దొడ్ల హరి, పూసలరవి, అంకయ్యచౌదరి, నక్కదినేష్, మహేంద్రరెడ్డి, కొమ్ము యోహాను, కరుణానిధి, గిరి జైపాల్ బరిలో ఉన్నారు.

నెల్లూరు జిల్లాలో అత్యధిక పట్టభద్రుల ఓటర్లు

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 1,07,635 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత తిరుపతిలో 86,941, ప్రకాశం జిల్లాలో 82,225 మంది ఓటర్లు ఉన్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న జిల్లాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. అదే విధంగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నెల్లూరులో 8,165 మంది, తిరుపతి జిల్లాలో 6,132 మంది, ప్రకాశం జిల్లాలో 5,789 మంది టీచర్ ఓటర్లు ఉన్నారు.

మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

జే.పంగులూరు: మండలంలోని చందలూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. దేవాలయం 15వ శతాబ్దంలో కృష్ణదేవరాయుల వంశస్తుడైన ఆచార్యుల కాలంలో నిర్మితమైనట్లు శాసనాలు చెప్తున్నాయి. దేవాలయంలో ప్రతి ఏడాదిలో సౌరమానం ప్రకారం రెండు పర్యాయాలు సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్‌ని తాకుతాయి. అవి ఉత్తరాయణంలో కుంభ సంక్రమణంలో శతభిష కార్తెలో ఫిబ్రవరి 27, 28 తారీకుల్లో ఒక సారి ఉదయం గం.6.30 నుంచి గం .6.55 వరకు, అదేవిధంగా దక్షిణాయణంలో కన్యా సంక్రమణంలోని హస్తకార్తెలో అక్టోబర్ 14, 15 తేదీలో మరోసారి ఉదయం గం.6.05 నుంచి గం .6.30 వరకు సూర్యకిరణాల నేరుగా మూలవిరాట్‌ను తాకుతాయి. దీనికి అనుగుణంగానే సోమవారం చందలూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామివారిని నేరుగా సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా సోమవారం భక్తులు స్వామివారిని భక్తి శ్రద్ధలతో పూజించారు.



చందలూరులో మూలవిరాట్‌ను తాకుతున్న సూర్య కిరణాలు

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికలు సజావుగా జరిపేందుకు అవసరమైన శిక్షణను సమగ్రంగా పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు సూచించారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో జరిగే ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎన్నికల నిర్వహణ కోసం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ప్రకాశం భవనంలో శిక్షణ తరగుతులు నిర్వహించారు. దీనికి హాజరైన డీఆర్‌వో పీవోలు, ఏపీవోలకు పలు సూచనలు చేశారు. దీనిలో 10 మంది ప్రిసైడింగ్ అధికారులు, 14 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

విధులు నిర్వహించే ప్రాంతంలోనే నివాసం ఉండాలి

- డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: జిల్లాలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌పీ, సీహెచ్‌ఓలు విధులు నిర్వహించే ప్రాంతంలోనే నివాసం ఉంటూ ప్రజలకు సేవలందించాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి సూచించారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎంపీహెచ్‌పీ, సీహెచ్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రభుత్వం నిర్దేశించిన రిజిస్టర్, రికార్డుల మేరకు పనిచేయాలన్నారు. అన్నీ రిజిస్టర్‌లలో రోజువారీ వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. ప్రతి హెచ్‌డబ్ల్యూసీలో జనరల్ సమాచార రిజిస్టర్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న అన్నీ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు తెలియచేయాలన్నారు. ప్రజలకు శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, అనీమియా, ఫ్రైడే డ్రైడే, సేఫ్ డెలివరీ క్యాలెండర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సేవలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. దీనిలో డీపీఎంఓ వాణిశ్రీ, డీపీహెచ్‌ఎన్‌ఓ సుగుణమ్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాటమీ హెచ్‌ఓడీగా డాక్టర్ సుధాకర్‌బాబు


సుధాకర్‌బాబు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీగా డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆయన అసోసియేట్ ప్రొఫెసర్‌గా గుంటూరు మెడికల్ కాలేజీలో పనిచేస్తూ పదోన్నతి పొంది ప్రొఫెసర్‌గా ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అనాటమీ హెచ్‌ఓడీగా నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోవిడ్ సమయంలో గుంటూరు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా పనిచేసి ప్రభుత్వం నుంచి రెండు సార్లు ప్రసంశాపత్రాలు అందుకున్నారు. దీంతో పాటు గుంటూరు మెడికల్ కాలేజీలో బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డును సొంతం చేసుకున్నారు. మెడికల్ కాలేజీ అనాటమీ డిపార్ట్‌మెంట్‌లో మెడికల్ విద్యార్థులకు పలు ప్రత్యేక ప్రణాళికలతో దోహదపడే విద్యను అందిస్తానన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మద్దిపాడు: చెట్టుకు ఉరేసుకొని ఒడిషాకు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అన్నంగి రెవెన్యూ గ్రామ పరిధిలో సోమవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఒడిషా రాష్ట్రం నబరంగపూర్‌కు చెందిన జితేంద్ర (40) ఆదివారం ఒడిషా నుండి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు మధ్యవర్తి ద్వారా చేరుకున్నాడు. ఈ క్రమంలో ఓ కంపెనీలో పనిలో చేరాడు. అయితే ఏమైందో గానీ సోమవారం ఉదయం గ్రోత్‌సెంటర్‌లో 412 ప్లాట్‌లో ఉన్న రావి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. అన్నంగి గ్రామ రెవెన్యూ అధికారి ప్రగడ రాంబాబు ఫిర్యాదు చేయగా ఎస్సై సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చేందుకు పోలీసులను బరంగపూర్‌కు పంపిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వెలిగండ్ల: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని సురవారిపల్లి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం..రామలింగాపురం గ్రామానికి చెందిన బొర్రా బాలకోటిరెడ్డి(55) రామలింగాపురం నుంచి వెలిగండ్ల గ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. రామగోపాలపురం గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి వెలిగండ్ల నుంచి రామగోపాలపురంకు బైక్‌పై వస్తుండగా సూరవారిపల్లి గ్రామం సమీపంలోని మలుపు వద్ద రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ప్రమాదంలో బొర్రా బాలకోటిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని ఎస్సై మహేష్‌కుమార్ పరిశీలించారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని కార్మికుడు దుర్మరణం

చీరాల: ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణం ఒక నిండు ప్రాణం బలైంది. పనికి వెళ్లి ఇంటికి వస్తున్న కార్మికుడిని ట్రాక్టర్ వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో ఐటీసీ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పేరాల జక్కావారి వీధికి చెందిన గుంటి సోమసుందర్ (45) ఐటీసీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అయితే ఆదివారం పని ముగించుకుని బాపట్ల వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి పేరాల వస్తుండగా ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో ధాన్యం లోడుతో అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో సోమసుందర్ అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. నెల క్రితమే మృతుడు పెద్ద కుమార్తెకు వివాహం చేయగా మిగిలిన ఇద్దరు కుమార్తెలు చదువుకుంటున్నారు. కుటుంబానికి ఏకైక దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరు అవుతోంది.

రైలు కింద పడి వృద్ధురాలు మృతి


వృద్ధురాలి మృతదేహం

మార్కాపురం టౌన్: రైలు కింద పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం ఉదయం మార్కాపురం – తర్లుపాడు రైల్వేస్టేషన్ల మధ్య 145 కిలోమీటర్ రాయి వద్ద జరిగినట్లు హెడ్ కానిస్టేబుల్ హరిక్రిష్ణ తెలిపారు. మృతురాలికి సుమారు 65 ఏళ్లు ఉంటాయని, గులాబీ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


శిక్షణకు హాజరైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సైనికుల్లా పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు సోమవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. మన పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తున్నాయన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండానే గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు.

టీడీపీ ప్రభుత్వంలోనే అధిక అప్పులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి నీరుచెట్టు, ఇంకుడుగుంతలు పేరుతో ప్రజల సొమ్మును పార్టీ నేతలే మింగారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి రూపాయి అర్హుల ఖాతాకే చేరుతుందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ.20 కోట్లతో విద్యుత్ ఆధునికీకరణ పనులు చేశానన్నారు. సముద్ర తీరప్రాంతంలో 70 ఏళ్ల నుంచి వైర్లు, స్తంభాలు శిథిలావస్థకు చేరితే 15 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయన్నారు. జనజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. బకింగ్‌హామ్ బ్రిడ్జి పనులు 15 రోజుల్లో పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. వచ్చే నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఒంగోలు నియోజకవర్గ పరిశీలకుడు శేషగిరిరావు మాట్లాడుతూ గృహ సారథులు, సచివాయలం కన్వీనర్లు ఆత్మ విశ్వాసంతో పనిచేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నది గృహ సారథులు పరిశీలించాలన్నారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఐక్యంగా పనిచేసి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయిల సుమతి, వైస్ ఎంపీపీలు శెట్టి కోటేశ్వరమ్మ, తాత ఉమామహేశ్వరి, జిల్లా బీసీ సెల్ నాయకుడు జి.తిరుపతిరావు, మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, చెరుకూరి వీరరాఘవరావు, వి.రామచంద్రారెడ్డి, బాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నాన్న స్ఫూర్తితో జర్మనీ రాజకీయాల్లోకి..

- 5 సార్లు మేయర్‌గా, ఒకసారి ఎంపీగా
- భారత రాజకీయాలకు నేను సరిపోతానో లేదో అని వ్యాఖ్య
- రెండు తెలుగు రాష్ట్రాల్లో యలమందారెడ్డి శతజయంతి ఉత్సవాలు
- జర్మనీలోని అల్ట్‌లాండ్స్‌బర్గ్ మాజీ మేయర్ డాక్టర్ గుజ్జుల రవీంద్ర


కనిగిరిలో గుజ్జుల యల్లమందారెడ్డి, సరళాదేవి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న డాక్టర్ రవీంద్ర

ఒంగోలు టౌన్: ఒక భారతీయుడిగా జర్మనీ రాజకీయాల్లో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నానంటే దానికి మా నాన్న గుజ్జుల యలమందారెడ్డి ఇచ్చిన స్ఫూర్తే కారణమని జర్మనీలోని అల్ట్‌లాండ్స్‌బర్గ్ మాజీ మేయర్ డాక్టర్ గుజ్జుల రవీంద్ర చెప్పారు. ఇండియాలో పుట్టి పెరిగి, చదువు కోసం జర్మనీ వెళ్లి అక్కడే డాక్టర్‌గా స్థిరపడి పెళ్లి చేసుకున్నానని తెలిపారు. వరుసగా 5 సార్లు మేయర్‌గా, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యానన్నారు. ఐదు దశాబ్దాల తరువాత తొలిసారిగా ఒంగోలులోని సీపీఐ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి యలమందారెడ్డి కనిగిరి ఎమ్మెల్యేగా మూడు సార్లు, ఎంపీగా ఒక సారి ఎన్నికయ్యారని, అప్పటికీ ఇప్పటికీ ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. భారతదేశ రాజకీయాలకు తను సరిపోతానో లేదో తెలియదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తన తండ్రి ఇచ్చిన స్ఫూర్తితోనే జర్మనీ రాజకీయాల్లో అడుగుపెట్టి అక్కడి ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నానన్నారు. దేశానికి, ప్రజలకు సేవ చేసేవారే అసలు సిసలు రాజకీయ నాయకుడన్నారు. తమకు కనిగిరిలో సొంతిల్లు కూడా లేదని, హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలోనే తన తలదండ్రులు నివాసం ఉండేవారని గుర్తు చేసుకున్నారు. తల్లిదండ్రుల పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం రవీంద్ర భార్య గుజ్జుల గాబి మాట్లాడుతూ భారతదేశ ప్రజలంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలు ఆప్యాయంగా ఉంటారని తెలిపారు. సీపీఐ సీనియర్ నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని డాక్టర్‌గా, రాజకీయనేతగా రవీంద్ర ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో గుజ్జుల ఈశ్వరయ్య, ఆర్.వెంకటరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.తొలుత గుజ్జుల యలమందారెడ్డి, సరళాదేవి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.

కనిగిరిలో..

కనిగిరి రూరల్: సీపీఐ జాతీయ నాయకుడు దివంగత ఎంపీ గుజ్జుల యల్లమందారెడ్డి కుమారుడు జర్మనీ దేశ మాజీ మేయర్ గుజ్జుల రవీంద్రారెడ్డి గాబ్రీ దంపతులు కనిగిరిలో విస్తృతంగా పర్యటించారు. తొలుత ఒంగోలు బస్టాండ్లోని హనీఫ్ స్థూపం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. బస్టాండ్‌లోని బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. చిన్నప్పుడు చదివిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యార్థులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. స్థానిక పామూరు బస్టాండ్‌లోని దివంగత మాజీ ఎంపీ గుజ్జుల యల్లమందారెడ్డి, సరళాదేవి విగ్రహాలకు నివాళులర్పించారు. తర్వాత కనిగిరికొండ, దొరువు ప్రాంతాన్ని పరిశీలించారు. రవీంద్రారెడ్డి దంపతులను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి సన్మానించారు. అనంతరం దివంగత మాజీ ఎమ్మెల్యే కోటపాటి గురుస్వామిరెడ్డి ఇంటికి వెళ్లి కోటపాటి రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కనిగిరి సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో భారతీయులంత తెలివి గల వారు ఎవరూ లేరని, భారతీయులు లేకపోతే సాఫ్ట్‌వేర్ రంగమే దెబ్బతింటుందన్నారు. జర్మనీ దేశంలో డాక్టర్లకు, నర్సులు, కాంపౌండర్లకు అత్యంత విలువ, గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. ఎంత పనిచేస్తే అంతా డబ్బు లభిస్తోందని తెలిపారు. జర్మనీ దేశ ప్రభుత్వం నుంచి భాగస్వామ్య నిధులతో ఏపీలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం పీసీపల్లి మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులతో మాట్లాడి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు గమనించి విద్యార్థులతో మాట్లాడారు.

మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వకుండా..

- ఆస్తి తగాదాల నేపథ్యంలో..
- తమ్ముడు మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకురాకుండా అడ్డుకున్న అన్న
- గేటుకు తాళం వేసి ట్రాక్టర్ అడ్డుపెట్టి..
- పోలీసులను ఆశ్రయించిన కుటుంబ సభ్యులు


రోడ్డుమీదనే ఉంచిన పెరుమాళ్లునాయుడు మృతదేహం

లింగసముద్రం: ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడు మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వకుండా అన్న అడ్డుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని విశ్వనాథపురంలో సోమవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పొడపాటి పెరుమాళ్లనాయుడుకి ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. దాదాపు 40 ఏళ్ల క్రితం ముగ్గురు అన్నదమ్ములు ఆస్తి పంపకాలు చేసుకున్నారు. పెరుమాళ్లనాయుడు కుటుంబసభ్యులు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలో వ్యవసాయం చేసుకుంటూ అక్కడే ఉండేవారు. ఇటీవల పెరుమాళ్లనాయుడుకి ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో రెండు నెలల నుంచి భార్య సత్యవతితో కలిసి స్వగ్రామమైన విశ్వనాథపురంలో ఉన్న పాత ఇంట్లో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం పెరుమాళ్లనాయుడు ఆరోగ్యం క్షీణించడంతో కుమారులు ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఆరోగ్యం మరీ క్షీణించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. వైద్యశాల నుంచి మృతదేహాన్ని సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు విశ్వనాథపురంలోని ఇంటికి తీసుకురాగా పెరుమాళ్లనాయుడి అన్న పాపయ్య మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకువెళ్లేందుకు వీల్లేదని, ప్రహరీ గేటుకు తాళం వేసి ట్రాక్టర్ అడ్డుపెట్టాడు. ఈ సమయంలో పెరుమాళ్లనాయుడు భార్య సత్యవతి ఇంట్లో ఉన్నారు. గేటుకి తాళం వేయడంతో ఆమె భర్త మృతదేహాన్ని చూసేందుకు వీలు లేకుండా పోవడంతో కన్నీటి పర్వతమైంది. విషయాన్ని మృతుని కుటుంబసభ్యులు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లుకి సమాచారం ఇచ్చారు. ఎస్సై చొరవ తీసుకుని పాపయ్యతో మాట్లాడడంతో ఉదయం 10 గంటల తరువాత మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకెళ్లేలా చేశారు.

దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

- చోరీ కేసులో అదనపు ఎస్పీ దర్యాప్తు


వివరాలు తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు

మార్కాపురం: మార్కాపురం పట్టణ నడి బొడ్డున శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన భారీ దొంగతనం కేసును విచారించేందుకు అదనపు ఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌రావు సోమవారం మార్కాపురం పట్టణానికి వచ్చి దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. మిద్దెపై నుంచి వచ్చి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న 80 సవర్ల బంగారు ఆభరణాలను తీసుకెళ్లిన విధానాన్ని, ఆధారాలు పరిశీలించి ఇంటి యజమాని గురువర్దన్‌తో కుటుంబసభ్యులతో మాట్లాడారు. తాను తన కుమార్తె వివాహం కోసం ఇటీవలే బంగారం కొనుగోలు చేసి బీరువాలో పెట్టుకున్నారని చెప్పారు. నేరస్తులను త్వరగా పట్టుకోవాలని, వివిధ కోణాల్లో దర్యాప్తు చేయాలని స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారు. దొంగల్ని పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాలకు పంపినట్లు సీఐ బీమానాయక్ చెప్పారు. పట్టణంలోని 4 వైపులా ఉన్న సీసీ కెమెరాలతో పాటు ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో దొంగతనం జరిగిన ఇంటికి సమీపంలో వచ్చిన కాల్ డేటాను, సిగ్నల్స్ ఆధారంగా కూడా పోలీసులు సర్వీస్ ప్రోవైడర్ల నుంచి సమాచారాన్ని తెప్పించుకొని పరిశీలిస్తున్నారు. దీంతో పాటు పాత నేరస్తులను కూడా పిలిపించి విచారణ చేస్తున్నారు. వారం రోజుల్లో దొంగల్ని పట్టుకుంటామని సీఐ నాయక్ చెప్పారు. తెలిసిన వారే చేసి ఉండోచ్చనే కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

పాలవెల్లువ ఉపయోగాలు తెలియజేయాలి

- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా వనగూరే ఉపయోగాలను పాడి రైతులకు తెలియచేసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశంభవనంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం అమలు తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించి పథకం లక్ష్యాలు, గ్రామ, మండల, జిల్లా టాస్క్‌ఫోర్స్ విధులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పాల వెల్లువ అమలుపై లైన్ డిపార్ట్‌మెంట్‌లు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ కారణాలతో మూతపడిన పాల కేంద్రాలను పునఃప్రారంభించేలా చూడాలన్నారు. రానున్న రెండు వారాల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి పర్యటన చేస్తానన్నారు. సమావేశంలో డీసీఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, ఏపీ డీడీసీఎఫ్ అధికారులు, అమూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రిటైర్డు ఉపాధ్యాయుడు

సింగరాయకొండ: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథా అనుసరిస్తూ అమాయకులను తమ ఉచ్చులోకి లాగి రూ.లక్షలు స్వాహా చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్–8వ లైనులో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు వలివర్తి గోపాలకృష్ణ ఇరుక్కుని అక్షరాలా రూ.1.68 లక్షలు పోగొట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడు గోపాలకృష్ణకు ఈనెల 23వ తేదీ గురువారం సెల్ నం.6389234128 నుంచి ఫోన్, మెసేజ్ వచ్చాయి. అవతల వ్యక్తి హిందీలో మాట్లాడుతూ మీరు కట్టిన కరెంటు బిల్లు మీ అకౌంట్‌కు కాకుండా వేరే అకౌంట్‌కు జమైందని, ఆ మొత్తాన్ని మీ అకౌంట్‌కు జమ చేయాలంటే ఎనీడెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రూ.3 ఆ యాప్ ద్వారా చెల్లించాలని సూచించాడు. తరువాత 24వతేదీ శుక్రవారం ఆన్‌లైన్ మోసగాడు చెప్పిన ప్రకారం మూడు రూపాయలను ఎనీడెస్క్ యాప్ ద్వారా చెల్లించాడు. అతను అమౌంట్‌ను చెల్లించగానే వెంటనే మూడు సార్లు మెసేజ్‌లు వచ్చాయి. ఆ మెసేజ్‌లు చూడగా మొదటి మెసేజ్‌లో రూ.49,900, రెండో మెసేజ్‌లో రూ.16 వేలు, మూడో మెసేజ్‌లో రూ.3,700 బ్యాంకు ఖాతానుంచి చెల్లించినట్లు వచ్చింది. తరువాత వెంటనే తేరుకున్న ఉపాధ్యాయుడు సైబర్ క్రైంకు, ఎస్‌బీఐ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తన కార్డు బ్లాక్ చేయాలని కోరాడు. తరువాత బ్యాంకుకు వెళ్లి చూడగా 6 సార్లుగా మొత్తం రూ.1.68 లక్షలు డ్రా చేశారని గుర్తించాడు. తరువాత సైబర్ క్రైం అధికారుల సూచనతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా వివరించారు. ఎస్సై ఫాతిమా మాట్లాడుతూ కరెంటు బిల్లులు చెల్లించాలని, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు చెప్పాలని, ఓటీపీ చెప్పాలని ఎవరు ఫోన్ చేసినా, మీకు లాటరీ తగిలిందని లింకు ఓపెన్ చేయాలని మెసేజ్ వచ్చినా అటువంటి మోసాలకు ఎవరు గురికావద్దని, డబ్బులు నష్టపోరాదని హితవు పలికారు.

రేపటి నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

- మార్చి 6న తిరునాళ్ల..7న కల్యాణం


లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

మద్దిపూడి: పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ శుభకృత నామసంవత్సర ఫాల్గుణమాస శుద్ధమి రోజైన మార్చి 1 మొదలుకుని మార్చి 11వ తేదీ వరకు జరుగుతాయని ధర్మకర్త మండలి చైర్మన్ కుప్పం కొల్లారావు, కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. మార్చి 6న జరుగనున్న లక్ష్మీ నృసింహ స్వామి తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. 1న అంకురారోపణతో ప్రారంభమై, 2న శేషవాహనం, 3న హంసవాహనం, 4న సింహవాహనం, 5న హనుమంతు వాహనాలపై స్వామి ఊరేగిస్తామన్నారు. మార్చి 6న జరిగే తిరునాళ్ల సందర్భంగా స్వామి గరుడ వాహనంపై వైభవంగా ఊరేగించనున్నారు. 7న ఎదురుకోల ఉత్సవం, 8న రథోత్సవం, 9న అశ్వవాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగిస్తారు. 10న పూర్ణాహుతి, 11న ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. 6న జరిగే గరుడోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు లక్షల్లో హాజరు కానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో బారికేడ్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. తిరునాళ్లను పురస్కరించుకొని రెడ్డి, కమ్మ, యాదవ, గౌడ, చాకలి, బలిజ, కుమ్మరి తదితర సామాజిక వర్గీయులు ఏర్పాటుచేసుకున్న సత్రాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి డీఎస్పీ నారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రాకపోకలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు సంగీత, షాహిద ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయనున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో తోటల దగ్ధం


అగ్నికి ఆహుతైన అరటితోట

బేస్తవారిపేట: విద్యుత్ ప్రమాదంలో చెరుకు, అరటి తోటలు దగ్ధమైంది. ఈ సంఘటన బేస్తవారిపేట మండలంలోని చింతలపాలెం సమీపంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన షేక్ ఖాశీంవలి అనే రైతు 1.20 ఎకరాల చెరకుతోట, ఎకర అరటితోటను సాగు చేస్తున్నాడు. అరటితోట మధ్యలో నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు అరటి చెట్లకు తగలడంతో విద్యుత్ రవ్వలు ఏర్పడి పొలంలో పడ్డాయి. ప్రమాదంలో 2.20 ఎకరాల్లో సాగు చేసిన పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. పొలంలో చెట్లకు వేసిన డ్రిప్ పరికరాలు, స్ప్రింకర్లు, ప్లాస్టిక్ పైపులు కాలిపోయాయి. ప్రమాదంలో రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. కంభం అగ్నిమాపకదళ సిబ్బంది చుట్టుపక్కల తోటలకు మంటలు వ్యాపించకుండా అదుపులోనికి తీసుకువచ్చారు.